సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 19 । మే । 2023



ఆర్టిజన్లపై బదిలీ వేటు

ఇటీవల చేపట్టిన సమ్మెలో పాల్గొన్న ఆర్టిజన్ కార్మికులపై జెన్‌కో యాజమాన్యం బదిలీ వేటు వేసింది. 8లో



అకాల వర్షంతో ఆగమాగం

జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఎండల ప్రభావం అధికంగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. రాత్రికి కూడా ఉక్కపోతగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశా రు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం



స్వామివారి విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం- జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో గురువారం వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. మేళతాళాలతో స్వామివారి విగ్రహాలను యాగశాలకు తీసుకొచ్చి.. మండపారాధన, గణపతి పూజ అనంతరం హోమం జరిపించారు. చివరకు పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు పెద్దమ్మతల్లికి 108 సువర్ణ పుష్పాలతో అర్చనచేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రవికుమార్ శర్మ, నర్సింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి..

పెద్దమ్మతల్లి అమ్మవారిని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చక్రపాణి, టెక్నికల్ అడ్మినిస్ట్రేటివ్ కొండలరావు, కె. దుర్గాప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

నేడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష

సుజాతనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి శుక్రవారం రాత పరీక్ష నిర్వహిస్తుండగా.. జిల్లాలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలను పరీక్ష కేంద్రంగా ఎంపిక చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8నుంచి 9.30 గంటల మధ్య, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల మధ్య కేంద్రంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మొత్తం 125 మంది పరీక్షకు హాజరవుతారని తెలిపారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్ : గిరిజన గురుకుల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిన నియామకం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత, మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. అంతేకాక టేకులపల్లి, పాల్వంచ, ములకలపల్లి, గండుగులపల్లి, చర్ల, దుమ్ముగూడెం, గుండాల, సింగరేణి పాఠశాలల్లో స్వీ పింగ్ స్టాఫ్, కుకింగ్, సర్వీసింగ్ సిబ్బంది భర్తీకి సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఈనెల 20 – 26 తేదీల మధ్య భద్రాచలంలోని ప్రాంతీయ సమన్వయ అధికారి కా ర్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు 8790339243, 9949723291 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పశువైద్య సేవలు పెంచండి

భద్రాచలంఅర్బన్: గ్రామాల్లోని పశువులకు అందిస్తున్న వైద్య సేవలను మరింత విస్తృత పర్చాలని 1962 ప్రాజెక్ట్ రాష్ట్ర హెడ్ డాక్టర్ బాగిష్ మిశ్రా సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన భద్రాచలం, పినపాకలో 1962 వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పశు సంచార సేవలో జిల్లా మొదటి స్థానంలో ఉండడం హర్షణీయమన్నారు. పశువులకు వచ్చే వ్యాధులపై యజమానులకు అవగాహన కల్పించాలని, పశువులు మృత్యువాత పడకుండా చూడాలని సూచించారు. పశువైద్యులు వలీబాబా, అలిఫా, మేనేజర్ నాగేంద్ర, కో ఆర్డినేటర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మస్టరే మస్ట్‌గా !

- ఆ తర్వాత విధులకు డుమ్మా కొడుతున్న సింగరేణి 'గుర్తింపు' నేతలు
- వెసులుబాటును అలుసుగా తీసుకుని హవా
- హాజరు పడిన తర్వాత సొంత పనులకు..
- కార్మిక సంక్షేమం కంటే పైరవీలపైనే ధ్యాస



కొత్తగూడెంలోని టీబీజీకేఎస్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో కార్మికుల సంక్షేమం, హక్కులు తదితర అంశాలపై ఫోకస్ చేసేందుకు గుర్తింపు కార్మిక సంఘం నేతలకు ప్రత్యేక హక్కులు, వెసులుబాట్లు ఉన్నాయి. అయితే దీన్ని అలుసుగా తీసుకుని కొందరు నేతలు కార్మికుల సంక్షేమం కంటే సొంత పనులు, వ్యక్తిగత ఎజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడంలో అంకితభావం చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏరియాలో ఇద్దరికి అవకాశం..

నిబంధనల ప్రకారం కార్మిక సంఘంలో ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ ఇద్దరూ మస్టర్లు పడిన తర్వాత విధులకు దూరంగా ఉంటూ కార్మిక సంక్షేమంపై దృష్టి సారించే వెసులుబాటు ఉంది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలు ఉండగా ఒక్కో ఏరియాకు ఇద్దరు చొప్పున 22 మంది.. మహా అయితే 30 మంది వరకు రెగ్యులర్ విధుల కంటే కార్మిక సంక్షేమంపై ఫోకస్ చేసే అవకాశం ఉంది. అయితే ఈ నిబంధనను అలుసుగా తీసుకుని చిన్నా పెద్ద నేతలంతా మస్టర్లు వేసుకుని ఎంచక్కా చక్కర్లు కొడుతున్నారనే విమర్శలు గత కొన్నేళ్లుగా పెరిగాయి. మస్టర్లు పడి విధులకు దూరంగా ఉండే కొందరు నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తుండగా, మరికొందరు పైరవీల పనిలో బిజీ అయ్యారు. దీంతో ఈ అంశాన్ని సింగరేణి యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఎవరెవరు, ఎలా మస్టర్లు పద్దాక వెళుతున్నారో తెలుసుకునేందుకు 2021 చివరిలో సంస్థ వ్యాప్తంగా అంతర్గతంగా విజిలెన్స్ విచారణ చేయించింది.

ఒక్కో ఏరియాకు 20 నుంచి 30 మంది..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో గుర్తింపు సంఘానికి సంబంధించిన కొందరు పిట్ సెక్రటరీలు, మాజీ నేతలు, వీరి కోటరీలో ఉండే కార్మికులు మస్టర్లు పద్దాక బయటకు వెళ్తున్నట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇలా రోజుకు ఒక్కో ఏరియాలో 20 నుంచి 30 మందికి మస్టర్లు వేయించుకోవడం తప్పితే బొగ్గు ఉత్పత్తిపై ధ్యాస ఉండడం లేదని వెల్లడైంది. ఇలా సింగరేణి వ్యాప్తంగా సుమారు 300 మంది విధులకు గైర్హాజరవుతున్న విషయం బహిర్గతం అయింది. ఒక్కొక్కరికి సగటున రూ.60 వేలు వేతనం అనుకుంటే ప్రతీ నెల రూ.1.80 కోట్లు వ్యయానికి తగిన ఫలితం సంస్థకు రావడం లేదు. సాలీనా సగటున రూ.25 కోట్ల వరకు వృథా అవుతోంది.

యాజమాన్యంపైనే ఫిర్యాదు..

కాగితాలపైనే విధులు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో ఉద్యోగ ధర్మాన్ని విస్మరిస్తున్న కొందరు నేతలను తిరిగి పనిపై ఫోకస్ చేసేలా సంస్థాగత మార్పులకు సింగరేణి శ్రీకారం చుట్టింది. అయితే విజిలెన్స్ విచారణ, అందులో వెల్లడైన అంశాలు, తీసుకోబోతున్న చర్యలు, తమ వ్యవహా రాలకు అడ్డుగా మారనుండడంతో గుర్తింపు సంఘంలో ప్రభావం చూపగలిగిన కొందరు నేతలు రంగంలోకి దిగారు. సింగరేణి యాజమాన్యం తమపై కత్తి కడుతోందంటూ ప్రభుత్వ పెద్దల దృష్టికి మరో రకంగా అంశాన్ని తీసుకెళ్లారు. చివరకు పై నుంచి వచ్చిన ఒత్తిళ్లతో విజిలెన్స్ నివేదిక, దానికి అనుగుణంగా చేపట్టాల్సిన సంస్కరణలు అటకెక్కాయి. ఆఖరికి ఈ అంశంపై మాట్లాడేందుకు కూడా ఉన్నతాధికారులు నిరాకరించే పరిస్థితి నెలకొంది.

అప్పటి నుంచే...

సింగరేణిలో ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలకు అనుబంధంగా పని చేసే కార్మిక సంఘాల హవా నడిచింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలైన తర్వాత టీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం క్రమంగా బలం పుంజుకుంటూ వచ్చింది. ప్రస్తుతం టీబీజీకేఎస్ సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలో 2018లో శ్రీరాంపూర్‌లో భారీ ఎత్తున సింగరేణి కార్మికుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీంట్లో కార్మికులు పాల్గొనేందుకు యాజమాన్యమే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి పంపింది. మస్టర్లు ఇచ్చింది. ఒక్కో బస్సుకు సంక్షేమ అధికారిని నియమించింది. యాజమాన్యం చూపిన ఈ అత్యుత్సాహం తర్వాత సంస్థపై ప్రతికూల ప్రభావానికి కారణమైంది. ఆత్మీయ సమ్మేళనం తర్వాత నుంచి గుర్తింపు కార్మిక సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కొందరు నేతల తీరులో మార్పు వచ్చింది. పేరుకే ఖాకీ చొక్కా ధరించే కార్మికులు తప్ప తీరులో అంతా ఖద్దరు నేతల్లా ప్రవర్తించడం మొదలెట్టారు. వీరికి చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తే రాజకీయంగా అధికారులపై ఒత్తిడి తేవడం పరిపాటిగా మారింది. చివరకు ఖద్దరు కార్మిక నేతలు అసలు పనులే చేయని పరిస్థితికి చేరుకున్నారు. ఇదేమిటని ఎవరైనా అధికారి గట్టిగా ప్రశ్నిస్తే.. 'నిన్ను లేపేస్తాం' అని బెదిరించే స్థాయికి వ్యవహారం దిగజారింది.

వాన నీటిని ఒడిసి పట్టి..

- భూగర్భ జలాల పెంపులో భేష్..
- ఈజీఎస్ పనుల్లోనూ నీటి సంరక్షణకే ప్రాధాన్యం
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన జగన్నాథపురం



జగన్నాథపురం గ్రామ ప్రధాన రహదారి

ములకలపల్లి : వర్షపు నీటిని ఒడిసి పట్టడం, భూగర్భ జలాలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంలో మండలంలోని జగన్నాథపురం గ్రామ పంచాయతీ అగ్రభాగాన నిలిచింది. నీటి సంరక్షణకు చేపట్టిన కృషితో ఈ పంచాయతీ జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. 8 హ్యాబిటేషన్లు ఉన్న ఈ గ్రామంలో సుమారు 4000 మంది జీవనం సాగిస్తున్నారు. పరిగెత్తే నీటిని నిధాన పరచడం, ఆ నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను వృద్ధి పరిచేందుకు గతేడాది ఇక్కడ విశేష కృషి చేశారు. గ్రామస్తులందరికీ దీనిపై అవగాహన కల్పించారు.

కుంటలు, చెరువులు నిర్మించి..

జగన్నాథపురం పంచాయతీ పరిధిలో వాగు ప్రవాహం అధికంగా ఉంటుంది. దీంతో ఉపాధి హామీ వాటర్‌షెడ్ పథకాల్లో భారీగా చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు, చిన్న, పెద్ద చెరువులు నిర్మించి వృథాగా దిగువకు పోతున్న వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నించారు. చెరువుల్లో నీటి నిల్వల పెంపునకు పూడిక తీయించారు. ఈజీఎస్ ద్వారా ఇంటింటికీ ఇంకుడుగుంతలు నిర్మించారు. పొలాల గట్ల చుట్టూ వివిధ రకాలు మొక్కలు నాటారు. అటవీశాఖ ఆధ్వర్యంలోనూ అటవీ ప్రాంతాల్లో చెక్ డ్యామ్‌లు నిర్మించి, వాన నీటిని భూగర్భంలోని వెళ్లేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగారు. తద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి.

కేంద్ర బృందం అధ్యయనంతో..

జగన్నాథపురంలో ఇటీవల పర్యటించిన కేంద్ర ప్రత్యేక బృందం స్థానిక పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. ఆయా పథకాల్లో చేపట్టిన పనులు, వాటి ఫలితాలను బృందం సభ్యులు పరిశీలించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ క్రమంలో 2022 సంవత్సరానికి గాను నీటి అవార్డుల విభాగంలో ఈ పంచాయతీ జాతీయ స్థాయిలో ప్రథమ అవార్డు సాధించినట్లు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కలెక్టర్ అనుదీప్‌కు లేఖ పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను, పంచాయతీ పాలక వర్గాన్ని అభినందించారు.

బాధ్యత పెరిగింది



నేను ప్రథమ పౌరురాలిగా ఉన్న సమయంలో మా పంచాయతీకి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం, జల సంరక్షణలో ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషం. అన్ని వర్గాల ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. అవార్డు రావడంతో నా బాధ్యత మరింతగా పెరిగిందని భావిస్తున్నా. ఇకపై మరింత ఉత్సాహంతో పనిచేస్తా.

– గద్దం భవాని, సర్పంచ్, జగన్నాథపురం

రాజకీయాలకు ఇంకా సమయం ఉంది..

- కార్యకర్తల వినతి మేరకే పర్యటిస్తున్నా
- మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్



వెంకట్రావ్‌ను సన్మానిస్తున్న ఆయన వర్గీయులు

అశ్వారావుపేటరూరల్: రాజకీయాలు చేసేందుకు వచ్చే శీతాకాలం దాకా సమయం ఉందని, కార్యకర్తల ఒత్తిడి మేరకే ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ అన్నారు. గురువారం ఆయన అశ్వారావుపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా జలగం యువసేన నాయకులు చిక్కం గోపాలకృష్ణ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన ఇందిరాసాగర్(రుద్రంకోట) ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు పూర్తయితే వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి మిగులు జలాలు ఈ ప్రాంతానికి ఉపయోగపడేవని చెప్పారు.

అంతకుముందు ఆయన పామాయిల్ తోటలు సాగు చేస్తున్న అశ్వారావుపేట, దమ్మపేట, సత్తుపల్లికి చెందిన పలువురు రైతులతో మాట్లాడి గెలల దిగుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. అశ్వారావుపేటలో ఎకరానికి 12 నుంచి 14 టన్నులు, దమ్మపేటలో 8 నుంచి 10, సత్తుపల్లిలో 7 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వస్తోందని రైతులు వివరించారు. పామాయిల్ తోటల సాగుకు ఈ ప్రాంతాలే అనుకూలమని, ప్రాంతాలు మారితే దిగుబడి తగ్గుతుందని అన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో వచ్చే గెలల దిగుబడులు ఇతర ప్రాంతాల్లో సాగు చేస్తే రావన్నారు. ఏపీలోని అనంతపురం జిల్లాలో రైతులతో ఆయిల్‌ఫెడ్ పామాయిల్ పంటను సాగు చేయిస్తే అక్కడ దిగుబడి రాలేదని, దీనిపై అక్కడి రైతులు ఆయిల్‌ఫెడ్‌పై తిరగబడ్డారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో ఇక్కడా ఇలాంటి పరిస్థితే వస్తుందని వ్యాఖ్యానించడం గమనార్హం. అనంతరం ఆయన వర్గీయులు వెంకట్రావ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్లపు లీలాప్రసాద్, రామినేని సత్యనారాయణ, నల్లపు లక్ష్మీపతి, నాయుడు శ్రీను, పొడియం వెంకటేష్, ఫకీర్ పాల్గొన్నారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 19న జరిగే డ్రగ్ ఇన్‌స్పెక్టర్, 21, 22 తేదీల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్) రాత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో సిబ్బందికి సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. డీఐ పరీక్షకు సుజాతనగర్‌లోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలను, ఏఈఈ పోస్టులకు సుజాతనగర్‌తో పాటు పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇన్విజిలేటర్లతో సహా అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి తీసుకెళ్లవద్దని, నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.

ఒకే ఇంటి నంబర్లతో ఉన్న ఓటర్లను గుర్తించాలి

అశ్వారావుపేటరూరల్: ఒకే ఇంటి నంబర్లతో పదుల సంఖ్యలో ఓటర్లు ఉంటే గుర్తించి, సవరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన రాజకీయ పార్టీల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకే అడ్రస్‌తో 50కి పైగా ఓటర్లు ఉన్నారని, ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. ఓటర్ల జనన తేదీలు సక్రమంగా ఉండటం లేదని, ఓటర్ల నమోదులో ఉన్న తప్పులను ఫాం 8 ద్వారా సవరించుకోవాలని సూచించారు.

ఎడ్‌సెట్ ప్రశాంతం



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎడ్‌సెట్ ప్రశాంతంగా ముగిసింది. మూడు విడతల్లో పరీక్ష నిర్వహించగా 337 మంది హాజరయ్యారు. మొదటి విడతలో 17 మంది, రెండో విడతలో 10 మంది, మూడో విడతలో 14 మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

విధుల్లో అలసత్వం వద్దు

- సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం
- కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్‌లో ఆకస్మిక తనిఖీలు



కార్పొరేట్ ఏరియాలో రికార్డులు తనిఖీ చేస్తున్న బలరాం

కొత్తగూడెంటౌన్: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పర్సనల్, సివిల్ డిపార్ట్‌మెంట్లను డైరెక్టర్ (పా)ఎన్.బలరాం గురువారం తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లో అధికారులు నిర్వహిస్తున్న విధులు, ఎవరు ఎప్పుడు హాజరవుతున్నారు వంటి వివరాలపై ఆరా తీశారు. డిపార్టుమెంట్‌లో మెడికల్ ఇన్‌వాలిడేషన్, హౌస్ బిల్డింగ్ లోన్, సీఎంపీఎఫ్, పెండింగ్ గ్రాడ్యుటీ, డిపెండింగ్ ఎంప్లాయిమెంట్, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సివిల్ డిపార్టుమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న క్వార్టర్లను తక్షణమే మరమ్మతు చేయాలని సూచించారు. కార్మికుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పరి ష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్ పనులను వర్షాకాలంలోపు పూర్తి చేయాలని సూచించారు. ఆ యన వెంట జీఎంలు బసవయ్య, సూర్యనారాయణ, చీఫ్, సీనియర్ సెక్యూరిటీ అధికారులు హనుమంతరావు, జాకీర్ హుస్సేన్, డీజీఎంలు కె.శ్రీనివా స్, రాజశేఖర్, కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్, పర్సనల్ మేనేజర్ డి.కిరణ్‌బాబు, సీనియర్ పీఓ మురళి ఉన్నారు.

సాధుసంతుల పూజలు




స్వామివారి సన్నిధిలో సాధువులు


బూర్గంపాడు: సారపాకలోని సాకేతపురి ఆంజనేయ మందిరంలో సాధుసంతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు లోక కల్యాణార్థం సాధుసంతులు చేపట్టిన పాదయాత్రలో భాగంగా సాకేతపురి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి మందిర నిర్వాహకులు ఎంవీ.సుబ్రహ్మణ్యం, కమల్ సాహు, రామారావు, కిలారు రమేష్, సురేష్‌బాబు, రాంప్రసాద్, రాము తదితరులు స్వాగతం పలికారు.

చేపల వంటలతో విందు!

- వచ్చేనెల ఖమ్మం, కొత్తగూడెంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, మృగశిర కార్తె సందర్భంగా ఏర్పాటు
- ఇప్పటికే రెండు జిల్లాలకు చెందిన పలువురు మహిళలకు శిక్షణ



భిన్నమైన చేపల వంట రకాలు



చేపలను కోసే విధానంపై శిక్షణ ఇస్తున్న నిపుణులు

ఖమ్మంవ్యవసాయం: ఫిష్ బర్గర్, ఫిష్ సమోసా, ఫిష్ పకోడి, ఫిష్ బిర్యానీ, ఫిష్ సూప్స్, ఫిష్ కట్‌లెట్, స్మోక్‌డ్ ఫిష్, ప్రాన్స్ బట్టర్ ఫ్రై, ప్రాన్స్ పకోడి... ఈ పేర్లు ఎప్పుడైనా విన్నారా?! ఒకవేళ విన్నా రుచి చూశారా? రుచి చూడాలని అనుకుంటే మాత్రం రెడీగా ఉండండి! వచ్చే నెల 8నుంచి మూడు రోజుల పాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మృగశిర కార్తె సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంతో పాటు, కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో చేపల వంటకాలతో స్టాళ్లు ఏర్పాటుచేయనున్నారు. ఇన్నాళ్లు చేపల పులుసు, ఫ్రై పచ్చళ్ల రుచి మాత్రమే చూసిన ఉమ్మడి జిల్లా వాసులకు రుచికరమైన వంటకాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా ఇప్పటికే ప్రత్యేక శిక్షణ పొందిన మహిళల ఆధ్వర్యాన ఈ 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్' జరగనుంది.

ఉమ్మడి జిల్లాలో పుష్కలంగా వనరులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పుష్కలంగా జల వనరులు ఉండగా చేపల పెంపకం, వేటతో వేలాది మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో దాదాపు అన్ని జలాశయాలు అన్ని కాలా ల్లో నిండా నీటితో కళకళలాడుతున్నాయి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప పిల్లలతో మత్స్య సంపద పెరిగింది. ఖమ్మం జిల్లాలోని 1,100 జలాశయాల్లో 194 మత్స్య సహకార సంఘాలకు చెందిన 15,220 మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. వీరిలో 19 మహిళా మత్స్య సహకార సంఘాలు, ఏడు గిరిజన మత్స్య సహకార సంఘాలు కూడా ఉన్నాయి. ఇక భద్రాద్రి జిల్లాలో మొత్తం 763 జలాశయాలు ఉండగా, వీటి ఆధారంగా 60 మత్స్యకార సహకార సంఘాలు నాలుగు వేల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఈమేరకు భద్రాద్రి జిల్లా ఇల్లెందు, రొంపేడు గ్రామానికి చెందిన 15 మంది మత్స్యకార మహిళలతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు హైదరాబాద్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ అండ్ మేనేజ్‌మెంట్ వారు చేపలతో వంట పదార్థాల తయారీపై ఇచ్చిన శిక్షణలో పాల్గొన్నారు. అంతేకాక గిరిజన మత్స్యకార సంఘాల మహిళలు విశాఖపట్నంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆక్వా కల్చర్‌పై నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ తీసుకున్నారు.

పసందైన రుచులు, సాంస్కృతిక కార్యక్రమాలు

చేపల వంటకాల తయారీలో శిక్షణ పొందిన మహిళల ఆధ్వర్యాన ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డులో ఉన్న పీజీ కళాశాల, కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో మూడు రోజుల పాటు ఫిష్ ఫుడ్ ఫుస్టివల్ నిర్వహిస్తారు. ఈమేరకు ఇరవైకి పైగా వంటకాలను ప్రదర్శించనున్నారని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మత్స్యశాఖాధికారులు ఆంజనేయస్వామి, బి.వీరన్న తెలిపారు. స్టాళ్లలో చేపల పచ్చళ్లు, చేపలతో చేసే బర్గర్, సమోసా, పకోడి, బిర్యానీ, మంచూరియా, సూప్స్, కట్‌లెట్, స్మోక్డ్ ఫిష్, ఫ్రైడ్ ప్రాన్స్, బాల్స్ వంటివి చేపల ప్రియులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేలా సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు సాయంత్రం జరిగే ఫుడ్ ఫెస్టివల్‌కు తోడు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకారులతో ప్రదర్శనలు కూడా ఉంటాయి.

మహిళలతో వలల ప్రదర్శన

పాలేరు రిజర్వాయర్ ఆధారంగా రూపుదిద్దుకున్న నాయకన్‌గూడెంకు చెందిన మహిళా మత్స్య సహకార సంఘం సభ్యులతో చేపలు పట్టే వలల ప్రదర్శన కూడా ఏర్పాటుచేయాలని అధికారులు భావిస్తున్నారు. నాయకన్‌గూడెం మత్స్య సహకార సంఘం మహిళలు వలల తయారీలో నిపుణులు కాగా, ప్రత్యేక శిక్షణ కూడా పొందారు. వీరు రెండు, మూడు, నాలుగు కన్నుల వలలే కాక రొయ్యలను పట్టే వలలనూ తయారు చేస్తారు.

చేపల పండుగ ప్రత్యేకతను చాటుతాం



తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఖమ్మంలో నిర్వహించనున్నాం. శిక్షణ పొందిన మహిళా మత్స్యకారులతో ఈ పండుగ జరుపుతాం. చేపల ప్రియులకు మూడు రోజుల పాటు నోరూరించే రుచులతో వంటలను అందుబాటులో తీసుకొస్తాం. – ఆంజనేయస్వామి, ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి

భిన్నమైన వంటకాల రుచి చూపిస్తాం



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లోభాగంగా భిన్నమైన చేపల వంటకాలను ప్రదర్శనతో పాటు చేపల ప్రియులకు రుచి చూపిస్తాం. వివిధ రకాల చేపల పచ్చళ్లు, ఫిష్ పకోడీ, ఫిష్ బిర్యానీ, ప్రాన్స్ బిర్యానీ వంటి రుచులను అందుబాటులోకి తీసుకురానున్నాం. మత్స్యశాఖ ద్వారా ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ పొందాం.

– లింగాల వాణి, కల్లూరు, ఖమ్మం జిల్లా

క్లుప్తంగా

25లోగా పాఠశాలల్లో చేరాలి

భద్రాచలం అర్బన్: రానున్న విద్యాసంవత్సరం గిరిజన గురుకులాల్లో 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా చేరాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఓ ప్రకటనలో సూచించారు. ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయని తెలిపారు. ఈమేరకు సంబంధిత వెబ్‌సైట్ నుంచి పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని కేటాయించిన పాఠశాలలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, టీసీ, బోనఫైడ్ సమర్పించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

నాబార్డు సహకారంతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న జాగృతి స్వచ్ఛంద సంస్థ సీఈఓ కుముదిని

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం వాటర్‌షెడ్ కమిటీ పరిధిలో రానున్న రోజుల్లో నాబార్డు సహకారంతో రూ.2 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జాగృతి స్వచ్ఛంద సంస్థ సీఈఓ కుముదిని తెలిపారు. మండలంలోని మాణిక్యారం గ్రామంలో గురువారం నిర్వహించిన మర్రిగూడెం వాటర్‌షెడ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతేడాది రూ.8లక్షల వ్యయంతో ఫారం పాండ్స్, రాళ్ల కట్టడాలతో చెక్ డ్యాంలు నిర్మించామని గుర్తుచేశారు. ఈఏడాది రూ.2 కోట్లతో ఫిష్ పాండ్స్, తోటల పెంపకం, చెక్ డ్యాంలు, రాళ్ల కట్టడాలు, కూరగాయల పెంపకం, మిర్చి నర్సరీ లాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, భూమిలేని పేదలకు మైక్రో రుణాలు ఇస్తామని, జాతీయ వ్యవసాయ గ్రామీణ బ్యాంకు ద్వారా ఆర్థిక వనరులు కల్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు కన్సల్టెంట్ ప్రకాష్, మాణిక్యారం, ముత్తారపుకట్ట సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, మంకిడి కృష్ణ, కమిటీ అధ్యక్షుడు జనగం కోటేశ్వరరావు, కో–ఆర్డినేటర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

ఖమ్మంఅర్బన్: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఈ నెల 20వ తేదీ నుంచి ముప్పై రోజుల పాటు గ్రామీణ ప్రాంత యువకులకు మగ్గం వర్క్, బ్యూటీపార్లర్ నిర్వహణపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 18 నుంచి 45 ఏళ్ల మహిళలే అర్హులని, ఎస్సెస్సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగు ఫొటోలతో ఖమ్మం రూరల్ మండలం తరుణి హట్‌లోని కార్యాలయంలో ఉదయం 10నుండి సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు అందజేయాలని డైరెక్టర్ విశాల్‌దేవ్ తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనిఫాం, శిక్షణ పూర్తయ్యాక టూల్ కిట్లు అందిస్తామని పేర్కొన్నారు. కేవలం 35మంది మాత్రమే అవకాశం ఉన్నందున దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 63014 38045, 98850 62799, 81253 94333 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గెస్ట్‌హౌస్‌లో కొండచిలువ



అటవీ సిబ్బంది పట్టుకున్న కొండచిలువ

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద ఉన్న జెన్‌కో గెస్ట్‌హౌస్ జలదృశ్యంలో గురువారం కొండచిలువ కనిపించింది. బాత్‌రూమ్ మూలకు చుట్టచుట్టుకుని పడుకున్న కొండచిలువ పామును చూసిన స్వీపర్ భయపడి, విధుల్లో ఉన్న ఫోర్‌మెన్ మహేష్‌కు చెప్పింది. ఆయన ఇచ్చిన సమాచారంతో వచ్చిన వైల్డ్‌లైఫ్ డీర్‌పార్కు వాచర్లు ఇబ్రహీం, కల్యాణ్ కొండచిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు.

మృతదేహం లభ్యం

ములకలపల్లి: మండల పరిధిలోని మూకమామిడి గ్రామానికి చెందిన వృద్ధుడు వాంకుడోతు కృష్ణ (50) సమీపంలో మూకమామిడి ప్రాజెక్ట్‌లో మృతదేహమై తేలాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన కృష్ణ, సాయంత్రం వరకూ తిరిగి ఇంటికి రాలేదు. ప్రాజెక్ట్ సమీపంలో ఆయన దుస్తులు, చెప్పులు కనిపించడంతో కుటుంబీకుల్లో ఆందోళన మొదలైంది. కాగా గురువారం ఉదయం ప్రాజెక్ట్‌లో కృష్ణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాతు ప్రాజెక్ట్‌లో పడి చెందాడని, మృతుని భార్య ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సుజాతనగర్: సింగభూపాలెం చెరువు సమీపంలోని ఓ సింగరేణి ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 16న సదరు ఉద్యోగి కుటుంబీకులు ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. అదేరోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. లాకర్‌లోని 20 తులాల బంగారం, 30 తులాల వెండిని ఎత్తుకెళ్లినట్లు సమాచారం. చోరీ విషయమై బాధితుడు స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కాగా పక్కనే ఉన్న మరో ఇంట్లో కూడా రూ. 5 వేల నగదు చోరీ చేసినట్లు సమాచారం.

అకాల వర్షంతో ఆగమాగం

- ఈదురుగాలులు, వడగండ్లతో వాన
- విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు, చెట్లు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



కొత్తగూడెంటౌన్: రామవరం సీఆర్‌పీ క్యాంప్‌లో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

కొత్తగూడెంఅర్బన్: జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. పలుచోట్ల ధాన్యం తడిసిపోయింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. ఇంటిపైకప్పులు ఈదురుగాలులుగా ఎగిరిపోయాయి. పాతకొత్తగూడెం ఏరియాలో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. పంజాబ్‌గడ్డ ఎనిమిదో వార్డులో గాలి దుమారం, వర్షానికి సింగంపల్లి శ్రీనివాస్ అనే ఆటో డ్రైవర్ ఇళ్లు పూర్తిగా ధ్వంసమైంది. వార్డు కౌన్సిలర్ కంచర్ల జమలయ్య, రెవెన్యూ అధికారులతో కలిసి కూలిన ఇంటిని సందర్శించారు. అదే ప్రాంతంలో చింత చెట్టు విరిగి పక్కనే ఉన్న సింగరేణి క్వార్టర్‌పై పడి రేకులు పగిలి ఇంటి యజమానికి గాయాలయ్యాయి.

వడగండ్ల వాన

కొత్తగూడెంటౌన్ : కొత్తగూడెంలో ఉరుములు, మెరుపులతోపాటు వడగండ్ల వాన కురిసింది. వడగండ్లు ఇళ్లపై పడి భారీగా శబ్దాలు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. దాదాపు రెండు గంటలకు పైగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. వీధుల్లోని విద్యుత్ స్తంభాలు సైతం నేలకొరిగాయి. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం, బస్టాండ్ ఏరియా, సూపర్‌బజార్, పాలకేంద్రం, చుంచుపల్లి, పాత కొత్తగూడెం, రామవరం రుద్రంపూర్, గౌతంపూర్‌లలో ఈదురుగాలుల రాళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, ఎస్‌సీబీ నగర్‌లో జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

చండ్రుగొండలో..

చండ్రుగొండ : మండలంలో గురువారం సాయంత్రం గాలిదుమారంతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో రైతుల ఇళ్ల ముందు పోసిన ధాన్యం రాసులు తడిసిపోయాయి. దీంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.



అశ్వాపురం: మల్లెలమడుగులో నేలమట్టమైన పాలపాటి బుచ్చమ్మ ఇల్లు

పాల్వంచలో..

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం, పట్టణ పరిధిలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వీధుల్లో స్వల్పంగా వరదలు ప్రవహించాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు పరదాలు కప్పుకుని జాగ్రత్తలు పడ్డారు.

కూలిన ఇళ్లు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు, తుమ్మలచెరువు, నెల్లిపాక గ్రామ పంచాయతీల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలి భీభత్సం సృష్టించింది. మల్లెలమడుగు గ్రామంలో పాలపాటి బుచ్చమ్మ, జాలె పూలమ్మ ఇళ్లు కూలిపోయి ఒంటరి వృద్ధులు నిరాశ్రయులయ్యారు. బైరు సాంబయ్య, గంగభవాని, రేపల్లె కృష్ణ, నోముల బుచ్చయ్య ఇంటిపై కప్పు రేకులు నేలకూలాయి. బాధితులను బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ పరామర్శించి రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే రేగా కాంతారావు దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కుర్వాపల్లి కొత్తూరు గ్రామంలో కణితి గోపయ్య పూరిల్లుపై పిడుగు పడి ఇల్లు దగ్ధమైంది. పలువురి ఇంటి పైకప్పులు లేచిపోయాయి.

భగభగల నుంచి ఉపశమనం

చుంచుపల్లి: దాదాపు రెండు వారాల నుంచి భానుడు భగభగలాడుతున్నాడు. రాష్ట్రంలోనే అత్యధికంగా జులూరుపాడులో 46.4 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, చుంచుపల్లి ప్రాంతాల్లో కూడా రికార్డు స్థాయిలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. కాగా గురువారం సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుంది. కారు మబ్బులు కమ్ముకుని గాలి దుమారం, ఉరుములతో కూడిన అకాల వర్షం కురిసింది. ఈదురుగాలుల దెబ్బకు కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మరికొన్ని చోట్ల ఇళ్ల పైకప్పులు, రేకులు ఎగిరి పడ్డాయి. కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, అశ్వాపురం తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పాల్వంచలో పిడుగుపాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇక కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అకాల వర్షానికి తడిసిముద్దయింది. కాగా వర్షం కురిసి, వాతావరణం చల్లబడటంతో ఎండ తీవ్రతకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న జిల్లా వాసులకు ఉపశమనం లభించినట్లయింది.



అశ్వాపురం: కుర్వాపల్లి కొత్తూరులో పిడుగు పడటంతో దగ్ధమైన కణితి గోపయ్య ఇల్లు



చండ్రుగొండ: ధాన్యంపై కప్పిన పట్టాలు



చుంచుపల్లి: పెనగడప కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం



కొత్తగూడెం అర్బన్: ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న వార్డు కౌన్సిలర్, రెవెన్యూ అధికారులు



కొత్తగూడెం అర్బన్: పాతకొత్తగూడెంలో ఏరియాలో విరిగిపడిన చెట్టు

ఆర్టిజన్లపై బదిలీ వేటు

- ఇటీవల సమ్మెలో పాల్గొన్న వారిపై జెన్‌కో యాజమాన్యం చర్యలు
- కేటీపీఎస్ నుంచి 16 మందికి స్థానచలనం
- విధుల నుంచి తొలగించిన కార్మికులను ఇంకా చేర్చుకోని అధికారులు



ఆర్టిజన్ కార్మికులు (ఫైల్)

పాల్వంచ: ఇటీవల చేపట్టిన సమ్మెలో పాల్గొన్న ఆర్టిజన్ కార్మికులపై జెన్‌కో యాజమాన్యం క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఇప్పటికే కేటీపీఎస్ కాంప్లెక్స్ నుంచి ఇద్దరు ఆర్టిజన్లను విధుల నుంచి తొలగించింది. వారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా ఇంకా చేర్చుకోలేదు. కాగా గురువారం 16 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నెల 25న సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టిజన్ కార్మికులు ప్రకటించారు. ఈ క్రమంలో కార్మికులు సమ్మెకు వెళ్లొద్దని పేర్కొన్న జెన్‌కో ఉన్నతాధికారులు 144 సెక్షన్ అమలు చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేసి సఫలీకృతమయ్యారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా విధులు బహిష్కరించడంతోపాటు ఆందోళనలో ఇతర కార్మికులు సైతం పాల్గొనేలా ప్రేరేపించారంటూ ఆ మరుసటి రోజే సుమారు 200 మందిని ఏకకాలంలో విధుల నుంచి తొలగించారు. ఈ క్రమంలో కేటీపీఎస్ నుంచి ఉండేటి జయరాజు, ఆవుల కృష్ణారెడ్డి తమ ఉద్యోగాలు కోల్పోయారు. అనంతరం జెన్‌కో, ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావు, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డితో పలు పార్టీల నేతలు, ఆర్టిజన్ సంఘాల నేతలు కలిసి జరిపిన చర్చల్లో.. తొలగించినవారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటామని యాజమాన్యం హామీ కూడా ఇచ్చింది. కానీ ఇప్పటివరకు చేర్చుకోలేదు.

తాజాగా 16మందిపై బదిలీ వేటు

ఆర్టిజన్ల సమ్మెలో పాల్గొనడంతోపాటు ఇతరులను ప్రేరేపించిన వారిపై విజిలెన్స్ ఆరా తీసింది. ఈ క్రమంలో వారిపై చర్యలకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా పనిష్మెంట్ కింద ఎవరినైనా బదిలీ చేయాలంటే థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి జల విద్యుత్ కేంద్రాలైన శ్రీశైలం, నాగర్జున్ సాగర్‌లకు బదిలీ చేస్తుంటారు. ఇప్పుడు కూడా అలాగే పలువురికి స్థానచలనం కల్పించారు. కాగా, ఈ బదిలీలను జెన్‌కో విజిలెన్స్ ఓఎస్డీ వినోద్ కుమార్ ధ్రువీకరించారు.

బదిలీ వేటుకు గురైన కార్మికులు

- కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారానికి చెందిన సయ్యద్ సమీవుల్లా (గ్రేడ్2)ను శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్‌కు, సయ్యద్ జిలానీ పాషా (గ్రేడ్4) నాగర్జున సాగర్ హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్, సోమనబోయిన నవీన్ కుమార్ (గ్రేడ్3) సింగూరు మినీ హైడల్ ప్రాజెక్ట్, వెంపటి అనిల్ కుమార్ (గ్రేడ్1) రామగుండం, బి.రాంబాయి(గ్రేడ్4), బోగా శ్రీకాంత్ లోయర్ జూరాల హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్, ఎస్.శ్రీపతి రాజు(గ్రేడ్4), ఎండి.మసూద్(గ్రేడ్2)లను ప్రియదర్శిని జూరాల హైడ్రో ఎలక్ట్రికల్ స్టేషన్లకు యాజమాన్యం బదిలీ చేసింది.
- కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం నుంచి వి.రామకృష్ణ (గ్రేడ్2,), ఆర్.శ్రీను (గ్రేడ్2), ఎస్ వి.లక్ష్మీనారాయణ (గ్రేడ్2)లను రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌కు, ఎన్. కోటయ్య((గ్రేడ్4), ఎ.హన్మంతరావులను భూపాలపల్లి కాకతీయ పవర్ స్టేషన్‌కు బదిలీ చేసింది.
- శ్రీశైలం నుంచి కె.నాగూల్ ((గ్రేడ్2)ను మినీ హైడల్ ప్రాజెక్ట్ పోచంపాడుకు, టి.చంద్రశేఖర్ (గ్రేడ్3) పాలేరు మినీ హైడల్ ప్రాజెక్ట్‌కు, ఎన్.రాఘవేందర్ రెడ్డి (గ్రేడ్2)ను పాలేరుకు బదిలీ చేశారు. వీరు సంబంధిత స్టేషన్‌లో విధుల్లో చేరాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పోస్టింగ్‌ల మార్పు కోసం అభ్యర్థనలు స్వీకరించబోమని ఉత్తర్వులు జారీ చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్/భద్రాచలంటౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.రమేష్, కృష్ణసాగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మణ్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి గానూ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రానిక్–మెకానిక్, ప్లంబర్ తదితర ట్రేడ్‌లలో అడ్మిషన్లకు జూన్ 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

టేకులపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి హెచ్చరించారు. గతంలో టేకులపల్లి మండలంలో నకిలీ విత్తనాలు విక్రయించిన నలుగురిని గురువారం రూ.10 లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేశారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో 79 మందికి అర్హత

కొత్తగూడెంఅర్బన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, లోకల్‌బాడీ పాఠశాలల విద్యార్థులు 79 మంది అర్హత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువు మధ్యలో మానేయకుండా ప్రతీయేటా ఈ పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి ఉపకార వేతనాలు అందిస్తున్న విషయం తెలిసిందే.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

టేకులపల్లి: టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి గురువారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవల్లో పాల్గొనవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కల్గించొద్దని, క్రమ శిక్షణతో మెలిగి, క్రమం తప్పకుండా పోలీ సు స్టేషన్‌కు హాజరవుతుంటే రౌడీషీట్ తొలగి పోయే అవకాశం లభిస్తుందని సూచించారు. తొలుత రికార్డులు పరిశీలించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: పోలారం గ్రామపంచాయతీ బొంబాయితండా గ్రామానికి చెందిన టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్ వీరన్న గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు ఖమ్మం ఆస్పత్రికి సిఫారసు చేశారు. వీరన్న ప్రస్తుతం కొత్తగూడెం బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు



పోలీసులు రికవరీ చేసిన సెల్‌ఫోన్లు

భద్రాచలంఅర్బన్: సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న నిందితులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... భద్రాచలం పట్టణ పరిసర ప్రాంతాల్లో సెల్ ఫోన్ల చోరీలు జరుగుతుండటంతో పోలీసులు భద్రాచలం ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ సాయంతో ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. రూ.2.5 లక్షల విలువైన 16 సెల్‌ఫోన్లను వారి నుంచి రికవరీ చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చి రాత్రి వేళల్లో భద్రాచలం కరకట్ట, రామాలయం పరిసరాల ప్రాంతాల్లో నిద్రపోతున్న భక్తుల సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఆ ఫోన్లను పట్టణంలోని కొన్ని దుకాణాల్లో తక్కువ ధరకే విక్రయించినట్లు వెల్లడించారు. కాగా ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు రెడ్డి, ఎస్‌ఐలు తెలిపారు.

వీధి కుక్కల దాడి

ఇద్దరు చిన్నారులకు గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ క్యాంపు కొమ్ముగూడెం గ్రామంలో గురువారం రాత్రి వీధి కుక్కల దాడిలో ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలయ్యాయి. ఆరుబయట ఆడుకుంటున్న 16 నెలల నవదీప్, మూడేళ్ల రోహిత్‌లపై వీధి కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు కర్రలతో వెంట పడటంతో కుక్క పరారయ్యింది. నవదీప్‌ను వీపు భాగంలో, రోహిత్‌కు కాలు భాగంలో గాయాలయ్యాయి. చిన్నారలను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.


గొడ్డలి తగిలి రైతు మృతి



అజ్మీర లాలు (ఫైల్)

టేకులపల్లి: చేలో చెట్టు నరుకుతుండగా గొడ్డలి తగిలి రైతు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని బిల్లుడుతండా పంచాయతీకి చెందిన అజ్మీర లాలు(40) భార్య నీరోలి(సరోజ), కుమారుడు సుధీర్‌తో కలిసి చేనుకు వెళ్లాడు. భార్య, కొడుకు చెత్త ఏరుతుండగా, లాలు చేలో ఉన్న మేడి చెట్టును గొడ్డలితో నరుకుతున్నాడు. ఈ క్రమంలో గొడ్డలి, చెట్టు కొమ్మ మర్మాంగానికి తగలడంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వడదెబ్బతో వృద్ధుడు..



రాజలింగం (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని విజయలక్ష్మినగర్ గ్రామపంచాయతీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కోవ్వూరి రాజలింగం (75) వడదెబ్బకు గురై గురువారం మృతిచెందాడు. రెండు రోజులుగా జీవభృతి కోసం మండుటెండల్లో పనిచేసిన రాజలింగం అర్ధరాత్రి బహిర్భూమికి వెళ్ళి అక్కడే స్పృహ తప్పి మృతిచెందాడు. తెల్లవారిన తర్వాత గుర్తించినట్లు స్థానికులు తెలిపారు.

అనుమానాస్పదంగా రైతు..



శంకర్(ఫైల్)

టేకులపల్లి: అనుమానాస్పద స్థితిలో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. తావుర్యాతండా పంచాయతీ స్టేషన్ తడికలపూడి గ్రామానికి చెందిన నూనావత్ శంకర్ (50) గురువారం తన పొలంలో కొలతలు ఉంటే వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. విపరీతమైన ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ తగిలి చనిపోయాడని కుటుంబ సభ్యులు భావించి ఇంటికి తీసుకొచ్చారు. దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఒంటిపై గాయాలు కనిపించడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడికి భార్య గంగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పిడుగుపాటుతో కేటీపీఎస్ ఉద్యోగి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

పాల్వంచ: పిడుగుపాటుతో ఓ కేటీపీఎస్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కేటీపీఎస్‌లో జేపీఏగా విధులు నిర్వర్తిస్తున్న ఏటుకూరి నాగేశ్వరరావు(57) మున్సిపాలిటీ పరిధిలోని పేటచెరువు వద్ద పొలం పనికి వెళ్లాడు. గురువారం సాయంత్రం వర్షం కురుస్తుండటంతో సమీపంలోని చెట్టు కిందకు వెళ్లి నిల్చున్నాడు. పిడుగుపాటుకు గురై కింద పడిపోయాడు. గమనించిన ఆటో డ్రైవర్ స్థానికులకు సమాచారం అందించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతునికి భార్య పద్మావతి, కుమారులు శ్రీకాంత్, నరేశ్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రి వద్ద పలువురు ఉద్యోగులు, నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చర్ల: రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడ్డ సంఘటన మండల పరిధిలోని ఆర్.కొత్తగూడెంలో గురువారం జరిగింది.స్థానికుల కథనం ప్రకారం .. భద్రాచలం వైపు నుంచి చర్ల వైపునకు వస్తున్న బొలెరో వాహనం ఆర్.కొత్తగూడెంలో రహదారి పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో అదుపు తప్పింది. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఇర్పా పార్వతి అనే మహిళను ఢీకొట్టింది. దీంతో ఆమె ఎగిరి సుమారు 20 అడుగుల దూరంలో రోడ్డు పక్కన పడిపోగా, తీవ్రగాయాలయ్యాయి. అనంతరం బొలెరో వాహనం రోడ్డు పక్కనే ఉన్న వెల్డింగ్ షెడ్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో షెడ్ మూసి ఉండటం, విద్యుత్ సరఫరా కూడా నిలిచివేసి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడ్డ మహిళను చికిత్స నిమిత్తం సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా పార్వతితోపాటు నడుస్తున్న మరో మహిళ గుండి నీలమ్మ దూసుకొస్తున్న వాహనాన్ని గమనించి పరుగెత్తడంతో ప్రమాదం నుంచి బయటపడింది.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి


రఘునాథపాలెం: మండలంలోని చెరువు కొమ్ము తండాలో పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో పాడి గేదెలు మృతి చెందాయి. వారం క్రితం గాలివానతో పొలంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. స్థానిక రైతులు విద్యుత్ అధికారులకు చెప్పినా మరమ్మతు చేయకపోవడంతో తెగిన లైన్‌కు సరఫరా అవుతోంది. దీంతో గురువారం మేతకు వెళ్లిన బానోత్ శంకర్, బదావత్ మంగ్యా, కృష్ణ, నాగేశ్వరరావుకు చెందిన నాలుగు పాడిగేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. ఈ విషయంపై విద్యుత్ ఏడీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎర్త్ వైర్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగినట్లు తెలిసిందని చెప్పారు. కాగా, రైతులకు పరిహారం అందించాలని మాజీ సర్పంచ్ రమేష్ కోరారు.

కోతల్లేని కరెంట్..

రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేనంతగా పెరిగిన వినియోగం

రోజుకు 248 మిలియన్ యూనిట్లు దాటిన వాడకం

- గత ఏడాది కంటే 27.51 శాతం అధిక డిమాండ్
- అయినా ఎక్కడా కోతల్లేకుండా నిరంతరాయంగా సరఫరా
- సీఎం జగన్ ముందుచూపు వల్లే ఇది సాధ్యం
- డిమాండ్ పెరిగి.. సాంకేతిక కారణాల వల్లే అక్కడక్కడ ట్రిప్
- నిమిషాల వ్యవధిలో సరిచేస్తున్న అధికారులు, సిబ్బంది
- గత ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలతో అల్లాడిన ప్రజలు
- అధికారికంగానే గంటల తరబడి కోతలు
- ఆ రోజులు మరిచి దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా


విద్యుత్ వెలుగుల్లో విజయవాడ

నాడు చీకటి రోజులు

గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 'పట్టణాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే పగలంతా విద్యుత్ సరఫరా ఉండదు' అని అధికారికంగా ప్రకటనలు జారీ అయ్యేవి. 'ఎండా కాలం కదా.. పవర్ కట్ మామూలే' అని అప్పటి పాలకులు దబాయించే వారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలిసేది కాదు. వంటింట్లో మిక్సీలు తిరక్క గృహిణులు, హాల్లో ఫ్యాన్ తిరక్క పిల్లలు, ఆఫీసుల్లో ఏసీలు పనిచేయక ఉద్యోగులు, జిరాక్స్ సెంటర్ల వద్ద విద్యార్థుల పాట్లు అన్నీ ఇన్నీ కాదు. విద్యుత్ ఎప్పుడొస్తుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వచ్చేది. ఆ రోజులను గుర్తు చేస్తే చాలు ప్రజలు కథలు కథలుగా చెబుతారు.

నేడు వెలుగు జిలుగులు

ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న పదానికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించారు. గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఏ రీతినా సమస్య లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం బొగ్గు నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవడంతోపాటు బయటి మార్కెట్‌లోనూ విద్యుత్ కొనుగోలు చేశారు. సరఫరాలో నాణ్యత పెరిగేలా వ్యవస్థాగత మార్పులు చేశారు. ఈ ఏడాది ఇదివరకెన్నడూ లేనంతగా అనూహ్యంగా డిమాండ్ పెరగడంతో అక్కడక్కడ ఓవర్‌లోడ్‌తో ట్రిప్ కావడం తప్పించి ఏ సమస్యా లేకుండా శ్రద్ధ పెట్టారు. అలాంటి చోట్ల నిమిషాల వ్యవధిలోనే మరమ్మతులు చేసేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తద్వారా ఇళ్లలో, కార్యాలయాల్లో ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న మాటే వినిపించడం లేదు. ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ, ఎక్కడా కోతలన్నదే లేకుండా సరఫరా సవ్యంగా సాగుతోంది. ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరగడం, ఎండలు మండిపోతుండటం వల్ల విద్యుత్ వినియోగం అమాంతం పెరిగింది. అయినా కాసేపు కూడా విద్యుత్ కోత లేకుండా నిరంతరాయంగా సరఫరా జరిగేలా సీఎం వైఎస్ జగన్ ముందు చూపుతో వ్యవహరించారు. గత సంవత్సరం గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఇప్పుడు 27.51 శాతం అధికంగా ఉంది. ఉష్ణోగ్రత 46 డిగ్రీలు దాటుతోంది. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఫలితంగా ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి గృహోపకరణాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఎక్కువ సమయం ఇంట్లోనే గడపడం వల్ల మిక్సీలు, గ్రైండర్లు, టీవీలు, కంప్యూటర్ల వినియోగం కూడా అధికంగానే ఉంటోంది. మరోవైపు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం రాకార్డు స్థాయిలో పెరిగిపోయింది. రోజువారీ డిమాండ్ 248.985 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 195.266 మిలియన్ యూనిట్లుగా ఉండింది. రోజులో పీక్ డిమాండ్ 12,482 మెగావాట్లుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 9,308 మెగావాట్లు మాత్రమే. అంటే 34.10 శాతం పెరిగింది. పగటి పూట సగటు పీక్ డిమాండ్ 10,374 మెగావాట్లు, సాయంత్రం వేళల్లో 9,582 మెగావాట్లకు చేరుకుంది. అయినప్పటికీ గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సంస్థలు నిరంతరం కరెంట్ సరఫరా చేస్తున్నాయి. ఇలా దేశంలోనే ఎక్కడా జరగడం లేదని, రాష్ట్రం అభివృద్ధిపథంలో పయ నిస్తోందని చెప్పడానికి ఇదొక పెరామీటర్‌గా చెప్పవచ్చని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

ముందుచూపుతో విద్యుత్ కొనుగోలు

ప్రస్తుతం ఏపీజెన్కో థర్మల్ నుంచి 89.981 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 5.414 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 43.012 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్, గ్యాస్ వంటి ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 28.510 మి.యూ, సోలార్ నుంచి 25.605 మి.యూ, విండ్ నుంచి 11.591 మి.యూ, ఇతర మార్గాల్లో 1.496 మిలియన్ యూనిట్ల చొప్పున విద్యుత్ సమకూరుతోంది. అయితే ఇది మాత్రమే సరిపోవడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.7.537 చొప్పున రూ.33.936 కోట్లతో 45.023 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ప్రతిరోజూ కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈవిధంగా డిమాండ్‌ను అందుకోలేక భారీగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు.

వాస్తవాలు మరచి దుష్ప్రచారం

ఎక్కడా విద్యుత్ కోతలు లేకపోయినప్పటికీ చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేలా ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో విద్యుత్ సరఫరా దుస్థితిని వ్యూహాత్మకంగా విస్మరిస్తోంది. గంటల తరబడి కోతలు విధించారనే విషయాన్ని దాస్తోంది. అప్పట్లో వేసవిలో కరెంటు పరిస్థితి చెప్పనలవి కాదు. వేసవిలో కాకుండా కూడా కోతలు విధించిన రోజులున్నాయి. పరిశ్రమలకైతే ఏకంగా పవర్ హాలిడేలు ఇచ్చారు. వారంలో మూడు రోజులు పరిశ్రమలన్నింటికీ తాళం వేయాల్సి వచ్చేది. జిరాక్స్ మెషీన్లు, పిండి మరలు, కూల్ డ్రింక్స్ దుకాణాలు, కూలింగ్ వాటర్ ప్లాంట్లు గంటల తరబడి పని చేయక చిరు వ్యాపారులు నష్టాలు చవిచూశారు. విద్యుత్ కోతల గురించి మాట్లాడితే అప్పటి ప్రభుత్వ పెద్దలు, మంత్రులు దబాయించే వారు. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ సీఎం జగన్ ప్రభుత్వం కోత అన్నదే లేకుండా విద్యుత్ సరఫరా చేస్తుంటే ఎల్లో మీడియాకు కడుపు మండుతోంది. వంకర బుద్ధి చూపిస్తూ.. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో విద్యుత్ పోయిన ప్రాంతాలను చూపుతూ దుష్ప్రచారం చేస్తోంది.

కోతల్లేకుండా ఇదే ప్రథమం

మాది పాలిమర్ ప్రాసెసింగ్ యూనిట్. రోజుకు 500 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగిస్తుంటాం. అయినప్పటికీ ఈ వేసవిలో ఏ రోజూ విద్యుత్ కొరత రాలేదు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారు. ఫలితంగా ప్రొడక్షన్ ఆగడం లేదు. గతంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండేవి. గంటల తరబడి మెషీన్లు ఆపితే తిరిగి అవి వేడెక్కేందుకు చాలా సమయం పట్టేది. మధ్యలో ఆగిపోవడం వల్ల సరుకు పాడయ్యేది. అందువల్ల ఆర్థికంగా చాలా నష్టపోయేవాళ్లం. ఇప్పుడు ఆ బాధలే లేవు. – ఐ.సురేష్ బాబు, పారిశ్రామికవేత్త, విశాఖపట్నం జిల్లా

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు

నేను 300 ఎకరాల చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నాను. ఏమాత్రం విద్యుత్ సరఫరా ఆగినా చాలా ఇబ్బంది పడిపోతాం. గతంలో అలాగే చాలా నష్టపోయాం. అప్పట్లో కరెంటు కోతలు ఎక్కువగా ఉండేవి. జనరేటర్లు పెట్టుకునే వాళ్లం. డీజిల్ మోటార్లతో నీరు తోడుకునేవాళ్లం. దానివల్ల పెట్టుబడి ఖర్చులు ఎక్కువయ్యేవి. చేతికొచ్చేది ఏమీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆక్వాకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను సబ్సిడీతో అందించడంతో పాటు విద్యుత్ కోతలు లేకుండా మా వంటి రైతులకు మేలు చేస్తోంది.
– ముంగర నరసింహారావు, ఆక్వా రైతు, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా

గత ప్రభుత్వ హయాంలో కోతలిలా

ఏడాది	మిలియన్ యూనిట్లు
2014–15	2202.07
2015–16	20.98
2016–17	34.89
2017–18	10.06
2018–19	6.50
2019–20	36.11

జార్ఖండ్‌లో 4.62 మి.యూ, హర్యానాలో 2.64 మి.యూ, ఉత్తరప్రదేశ్‌లో 2.03 మి.యూ, కర్ణాటకలో 1.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఏర్పడింది.

'గుండెపోటు' మాటే లేదు

ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం

- సీబీఐ ఎస్పీ నన్ను కలసినప్పుడు ఆ పదమే చర్చకు రాలేదు
- నేను చెప్పని అంశాలను చెప్పినట్లు ఆంధ్రజ్యోతి ఎలా రాస్తుంది?
- జర్నలిజం దిగజారుడుతనానికి పరాకాష్ట అంటే ఇదే



"నేను సీబీఐ ఎస్పీకి చెప్పని వాటిని కూడా చెప్పినట్లుగా ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించడం దిగజారుడు జర్నలిజానికి పరాకాష్ట. వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారని వైఎస్ జగన్ నాతో అన్నారని నేను సీబీఐకి వెల్లడించినట్లు వెలువడ్డ కథనం పచ్చి అబద్ధం" – అజేయ కల్లం

సాక్షి, అమరావతి: మేనిఫెస్టో కమిటీ సమావేశానికి, హత్య కేసుకు సంబంధం ముడిపెడుతూ కథనాలను ప్రచురించటాన్ని బట్టి ఆంధ్రజ్యోతి ఏ స్థాయికి దిగజారిందో అర్థం అవుతోందని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకా గుండెపోటుతో మృతి చెందినట్లు వైఎస్ జగన్ తనకు చెప్పారంటూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్త పచ్చి అబద్ధమని అజేయ కల్లం ఖండించారు. అంతకుముందే మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగిందని, అందులో పాల్గొన్న వారిని విచారించాలంటూ గతంలో ఓ కథనం వెలువరించిందని, అందులో భాగంగానే మళ్లీ పచ్చి అబద్ధాలను ప్రచురించిందన్నారు. ఏదో ఒకవిధంగా ముఖ్యమంత్రి జగన్ పేరును లాగాలనే ప్రయత్నం మినహా ఆంధ్రజ్యోతి కథనాల్లో వాస్తవాలు లేవని స్పష్టం చేశారు. సీబీఐ తనను విచారించిందంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తను గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అజేయ కల్లం తీవ్రంగా ఖండించారు. కొద్దిరోజుల క్రితం సీబీఐ ఎస్పీ తన ఇంటికి వచ్చి ఐదు నిమిషాలు మాట్లాడి సమాచారం తీసుకున్నారని, ఆ సమయంలో గుండెపోటు అంశం చర్చకే రాలేదని, దాని గురించి అడగలేదని అజేయ కల్లం వెల్లడించారు. వైఎస్ వివేకానందరెడ్డి మృతి చెందిన రోజు యాధృచ్ఛికంగా పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. సమావేశం జరుగుతుండగా కొంతసేపటికి 'వివేకానందరెడ్డి గారు నో మోర్..' అని ఇంగ్లిష్‌లో చెప్పడంతో ఇక లేచి వచ్చేశామన్నారు. అదే విషయాన్ని సీబీఐ ఎస్పీకి చెప్పానన్నారు. 'మీరు స్వచ్ఛందంగా అంగీకరిస్తే రికార్డు చేసుకుంటామని సీబీఐ ఎస్పీ కోరారు. సెక్షన్ 161 కింద సమాచారాన్ని అడిగారు. అయితే ఆ సమాచారం, రికార్డుకు న్యాయపరమైన విలువ ఉండదు. సంతకాలు తీసుకోలేదు' అని కల్లం పేర్కొన్నారు.

గుండెపోటు మాటే చర్చకు రాలేదు..

అసలు గుండెపోటు అనే పదమే సీబీఐ ఎస్పీని కలుసుకున్న సందర్భంగా చర్చకు రాలేదని అజేయ కల్లం స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో రహస్యంగా ఉండాల్సిన తమ ఇద్దరి సంభాషణ సమాచారం లీకుల పేరుతో ఆంధ్రజ్యోతిలో రావడం అంటే సీబీఐ విశ్వసనీయత కూడా దెబ్బతిన్నట్లేనని పేర్కొన్నారు. ఇది సీబీఐ పేరును దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. 'మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆ పనిమీద దృష్టి పెడతాం కానీ గడియారం చూసుకుంటూ కూర్చోం కదా! ఎవరు ఎప్పుడు బయటకు వెళ్లారో ఎలా తెలుస్తుంది? అయినా ఈ సమావేశాన్ని సీరియస్ మర్డర్ కేసుకు ముడిపెట్టి ఆంధ్రజ్యోతి తనకు కావాల్సినట్లు రాసుకోవడం కంటే అనైతికం మరొకటి ఉండదు..' అని కల్లం మండిపడ్డారు.

ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉంది

తన దగ్గర నుంచి తీసుకున్న సమాచారం చార్జిషీటు వేసేవరకు రహస్యంగా ఉండాలని, లీకుల పేరుతో తప్పుడు సమాచారం మీడియాలో ప్రచురితమైనందున ఆ వార్తను ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉందని కల్లాం పేర్కొన్నారు. తప్పుడు సమాచారంతో మీడియాలో సమాంతర దర్యాప్తు జరగకూడదని, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు మీడియాకు వివరాలు వెల్లడించరాదని సుప్రీం కోర్టు తీర్పులున్నాయని కల్లం ప్రస్తావించారు.

నా భార్యకు కూడా తెలియదు..

'దర్యాప్తు అంశాలను ఇష్టానుసారం ప్రచురించేందుకు, మీడియా తమ ఇష్టం అనేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు తాజా తీర్పులున్నాయి. కనీస క్రమశిక్షణ, కోడ్ ఆఫ్ కాండక్ట్ మీడియాకు అవసరం. నేను సీబీఐ ఎస్పీకి చెప్పని అంశాలను చెప్పినట్లుగా నా ఫొటోతో పెద్ద శీర్షిక పెట్టి కథనాలు ప్రచురించటాన్ని బట్టి ఆ పత్రిక ఏ స్థాయికి దిగజారిందో తెలుస్తోంది. ఆ సమయంలో నేను, సీబీఐ ఎస్పీ మాత్రమే ఉన్నాం. మా ఇంటికి సీబీఐ ఎస్పీ వచ్చిన విషయం నా భార్యకు కూడా తెలియదు. ఆంధ్రజ్యోతిలో తప్పుడు వార్త ప్రచురించిన తరువాతే మిగతా వారికి తెలిసింది' అని కల్లం తెలిపారు. తప్పుడు వార్తపై తగిన సమయంలో చర్యలు తీసుకుంటా' అని చెప్పారు.

సమాంతర విచారణ తగదు..

ఏదైనా క్రిమినల్ కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు దానికి సమాంతరంగా విచారణను ప్రభావితం చేసేలా మీడియా కథనాలను రాయకూడదు, చర్చలు పెట్టకూడదు. దర్యాప్తు సమయంలో విచారణాధికారికి సాక్షులు వెల్లడించిన అంశాలను చార్జిషీట్ వేసేవరకు బహిర్గతం చేయకూడదు. విచారణలో వెల్లడైన అంశాలను బహిర్గతం చేస్తూ కథనాలను ప్రచురిస్తే వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్లేనని పలు కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులిచ్చాయి. దీన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా స్వాగతించింది' అని కల్లం చెప్పారు.

జిల్లా వార్తలు

గోశాల, నిత్యాన్నదానానికి వితరణ


దాతకు రశీదు ఇస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానం, గోశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు గురువారం విరాళం అందచేశారు. హైదరాబాద్ తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన కుందురు ఇంద్రసేనారెడ్డి నిత్యాన్నదానానికి రూ.లక్ష, గోశాల నిర్మాణానికి రూ.లక్ష అందచేయగా అధికారులు రశీదు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు సాయిబాబా, రామిరెడ్డి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పీవీజీటీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

భద్రాచలంఅర్బన్: హైదరాబాద్ హయత్‌నగర్‌లో ఆదిమ, గిరిజన తెగల కోసం ఏర్పాటుచేసిన టీటీడబ్ల్యూఆర్ పీవీటీజీ(బాలురు, బాలికలు)ల్లో ప్రవేశాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొండరెడ్డి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. 2021–22, 2022–23 విద్యాసంవత్సరాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 95507 3026 నంబర్‌లో సంప్రదించాలని పీఓ సూచించారు.

పలు రైళ్లు రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: నెక్కొండ వద్ద మూడో రైల్వే లైన్ పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేసినట్లు ఖమ్మం సీసీఐ ఎం.డీ.జాఫర్ తెలిపారు. కాజీపేట–డోర్నకల్ ప్యాసింజర్(07753), డోర్నకల్–కాజీపేట ప్యాసింజర్(07754), విజయవాడ–డోర్నకల్(07755), డోర్నకల్–విజయవాడ(07756) ప్యాసింజర్లతో పాటు రెండు వైపులా శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 21నుండి వచ్చేనెల 7వరకు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే, మచిలీపట్నం–సికింద్రాబాద్(07185) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–మచిలీపట్నం(07186) ఎక్స్‌ప్రెస్ ఈనెల 21, 28, వచ్చేనెల 4న రద్దు చేసినట్లు తెలిపారు. ఇంకా గుంటూరు–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 21, 23, 25, 27, 28, 30తేదీల్లో రెండు గంటల ఆలస్యంగా నడుస్తుందని వివరించారు.

పోస్టాఫీసుల్లో మళ్లీ ఆధార్!

- కేంద్రాల నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీలకు...
- ఉమ్మడి జిల్లాలో మూడు విడతలుగా 16 కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే ఖమ్మంలోని రెండు పోస్టాఫీసుల్లో ప్రారంభం


ఖమ్మం గాంధీచౌక్ సబ్‌పోస్టాఫీస్‌లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం


ఖమ్మం జెడ్పీలోని తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రం

ఖమ్మంగాంధీచౌక్: పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. ఇప్పటికే అక్కడక్కడా సేవలు ప్రారంభమయ్యాయి. వ్యక్తి గుర్తింపు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ లక్ష్యంగా ఆధార్ వ్యవస్థను 2009లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ గుర్తింపు వ్యవస్థ జీవితకాలం చెల్లుబాటవుతుండగా.. నివాస రుజువు, పౌరసత్వ రుజువును ఆధార్ తెలియజేస్తోంది. గతంలోనే ఆధార్ కార్డు వ్యవస్థను మారుమూల ప్రాంతాల వరకు విస్తరించడంలో భాగంగా పోస్టాఫీసుల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే, ఉద్యోగుల కొరత, ఇతర సాంకేతిక సమస్యలతో తపాలా కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల నిర్వహణ మూలనపడింది. ఈ నేపథ్యాన కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తపాలా శాఖ ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఆధార్ కేంద్రాలను నిర్వహించేందుకు నిర్ణయించింది. దీంతో మూతపడిన ఆధార్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం ద్వారా మారుమూల ప్రజలకు తిరిగి సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఖమ్మం డివిజన్ పరిధిలో గతంలో తపాలా కార్యాలయాల్లో నిర్వహించే ఆధార్ కేంద్రాలను ఇప్పుడు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నిర్వహించాలనే ఉత్తర్వులు వెలువడగా... 16 కేంద్రాలను మూడు విడతల్లో ప్రారంభించేందుకు కసరత్తు మొదలుపెట్టారు.

దఫాలుగా కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలో కేటాయించిన మొత్తం 16 ఆధార్ కేంద్రాలను రెండు నుంచి మూడు విడతల్లో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. ప్రైవేట్ ఏజెన్సీలు సిద్ధంగా ఉన్న ఆరు పోస్టాఫీసుల్లో మొదటి విడతగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. మిగతావి రెండు లేదా మూడు దశల్లో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా ఖమ్మం జెడ్పీ(పాత కలెక్టరేట్)లోని తపాలా కార్యాలయం, గాంధీచౌక్ తపాలా కార్యాలయంలోని ఆధార్ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు.

ఎక్కడెక్కడంటే...

మొదటి దఫాగా ఖమ్మం పాత కలెక్టర్‌లోని తపాలా కార్యాలయం, కొత్తగూడెంలోని హెడ్ పోస్టాఫీస్, ఖమ్మం గాంధీచౌక్, మణుగూరు, ఇల్లెందు, చర్లలోని సబ్ పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలు ప్రారంభిస్తారు. ఇక రెండు, మూడో దశల్లో ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌తో పాటు అశ్వారావుపేట, భద్రాచలం, బూర్గంపాడు, మధిర, నేలకొండపల్లి, పాల్వంచ, సత్తుపల్లి, వైరా, ఎర్రుపాలెం సబ్ పోస్టాఫీసుల్లో ఈ సేవలు మొదలవుతాయి.

ప్రజల సౌకర్యం కోసమే...



తపాలా కార్యాలయాల్లో నిలిచిపోయిన ఆధార్ సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ఆధార్ సేవలను, కేంద్రాలను నిర్వహిస్తోంది. ఖమ్మం పోస్టల్ డివిజన్‌లో మొత్తం 16 తపాలా కార్యాలయాల్లో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఆధార్ సేవలు అందిస్తాం.
– బి.రవికుమార్, సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

ప్రభుత్వ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం

ఖమ్మంలో ఇద్దరి ప్రాణాలు కాపాడిన వైద్యుడు


కోలుకున్న సతీష్‌తో మాట్లాడుతున్న సూపరింటెండెంట్, న్యూరాలజిస్ట్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం ఉచితంగా అందడతో ఇద్దరి ప్రాణాలను కాపాడినట్లయింది. ప్రైవేట్‌లో వైద్యం చేయించుకునే స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఇద్దరికి న్యూరాలజిస్ట్ చైతన్య వైద్యసేవలు అందించి ప్రాణాలు నిలిపాడు. ఈమేరకు వివరాలను ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, న్యూరాలజిస్ట్ చైతన్య గురువారం వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన జె.సతీష్ ఈనెల 10న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం తిప్పరపల్లికి చెందిన కె.శ్రీను ఈనెల 14న ఆస్పత్రిలో చేరారు. వీరిద్దరికి గులియన్ బేరీ సింద్రోమ్ వ్యాధి ఉండగా.. ఒక్కసారిగా జ్వరం తీవ్రంగా వచ్చి అది నరాలకు వ్యాపించి ఆపై కాళ్లు, చేతులు చచ్చుబడి శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా మారుతుంది. అంతేకాక మరణానికి దారితీసే ఈ వ్యాధి అరుదుగా వస్తుందని తెలిపారు. వీరిద్దరు హైదరాబాద్, ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లగా ఖరీదైన చికిత్స కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి రాగా చికిత్స ప్రారంభించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా ఇమ్యూనో గ్లోబిలిన్ ఇంజక్షన్లు తెప్పించి చికిత్స చేయడంతో వారు కోలుకున్నారని తెలిపారు. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.20 వేల వరకు ఉండగా, ఒక్కొక్కరికి ఇరవై సార్లకు పైగా ఇచ్చినట్లు చెప్పారు. ఈ వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.5 లక్షల నుండి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. చికిత్స చేసిన డాక్టర్ చైతన్య, సిబ్బందిని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అభినందించగా, తమ ప్రాణాలు కాపాడిన వైద్యుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఐడియా అదుర్స్ !



వైరారూరల్: ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఉపశమనం కోసం రకరకాల మార్గాలు అన్వేషిస్తున్నారు. వైరా మండలం వల్లాపురానికి చెందిన చిరువ్యాపారి కసిమల్ల నారాయణ ఉక్కపోత భరించలేక, కూలర్ కొనుగోలు చేసే స్థోమత లేక వినూత్న ఆలోచన చేశాడు. గ్లూకోజ్ డబ్బాలో నీరు పోసి షట్టర్‌కు కట్టి పైపును టేబుల్ ఫ్యాన్‌పై కర్ర సాయంతో అమర్చాడు. గ్లూకోజ్ పైపు నుండి కారుతున్న నీరు ఫ్యాన్ స్పీడ్‌కు చిరుజల్లులుగా చిమ్ముతోంది. దీంతో వస్తున్న చల్లటి గాలికి ఉక్కపోత నుండి ఉపశమనం పొందుతున్నాడు.

కాంగ్రెస్ కంచుకోట అని నిరూపిద్దాం..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య, పక్కన సంభాని, దుర్గాప్రసాద్ తదితరులు

- ఖమ్మంలో వచ్చే నెలలో పీపుల్స్ మార్చ్ ముగింపు సభ
- ఎమ్మెల్యే వీరయ్య, మాజీ మంత్రి సంభాని వెల్లడి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ కంచుకోట అని మరోమారు నిరూపించేలా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర ముగింపు సభను ఖమ్మంలో భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య వెల్లడించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. జూన్ 10 నుండి 15వ తేదీ మధ్యలో భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఖమ్మం జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. ఈమేరకు యాత్ర ముగింపు సభ భారీగా నిర్వహించనుండగా ఏఐసీసీ, టీపీసీసీ అగ్రనేతలు హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయడం ద్వారా కాంగ్రెస్ సత్తా చాటాలని వారు కోరారు.

సన్నాహక సమావేశం

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర వచ్చేనెల జిల్లాకు చేరుకోనున్న నేపథ్యాన నాయకులు సమావేశమై చర్చించారు. మాజీ మంత్రి సంభాని, భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొనగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర స్ఫూర్తితో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లా నుండి మొదలుపెట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఇప్పటివరకు సుమారు 900 కిలోమీటర్ల మేర పూర్తయిందని చెప్పారు. వచ్చేనెలలో జిల్లాకు చేరుకునే యాత్రతో పాటు ముగింపు సభ విజయవంతంపై నాయకులు ఇప్పటినుంచే దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యులు మహ్మద్ జావేద్, రాయల నాగేశ్వరావు, పుచ్చకాయల వీరభద్రం, వడ్డె నారాయణరావు, నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, రాందాస్, మనోహర్ రెడ్డి, దొబ్బల సౌజన్య, యడ్లపల్లి సంతోష్ పాల్గొన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన దుర్గాప్రసాద్‌ను నాయకులు సన్మానించారు.

ఎంపీ నామ కృషితో పేదలకు లబ్ధి


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం నామ నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో పేదలకు సీఎంఆర్ఎఫ్ సాయం అందుతోందని రైతుబంధు సమితి ఖమ్మం జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు చెందిన 66 మందికి రూ.21,32,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. ఎంపీ కృషితో నాలుగేళ్లలో రూ.50 కోట్లకు పైగానే పేదలకు ఆర్థిక సాయం అందిందని తెలిపారు. పార్టీలను చూడకుండా అర్హత కలిగిన వారందరికీ సాయం అందేలా ఎంపీ సిఫారసు చేస్తున్నారని చెప్పారు. కాగా, సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు సాయం అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చేసేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకమేడల సత్యనారాయణ, పోట్ల శ్రీను, తన్నీరు రవి, గోడ్డేటి మాధవరావు, చిత్తారు సింహాద్రియాదవ్, ఉప్పునూతల నాగేశ్వరరావు, చింతలచెర్వు లక్ష్మి, బత్తుల శ్రీనివాసరావు, కొనకంచి వెంకటేశ్వర్లు, పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్, భార్గవ్ పాల్గొన్నారు.